## ఎన్నికల నిర్వహణకు

# పకడ్బందీ ఏర్పాట్లు

- అక్రమాలపై ఫిర్యాదుకు 'సీ విజిల్' యాప్
- పూర్తయిన మొదటి రౌండ్ ర్యాండమైజేషన్
- ప్రిసైడింగ్, సెక్టోరియల్ అధికారులకు పూర్తయిన శిక్షణ
- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,25,398
- మొత్తం 1,151 పోలింగ్ కేంద్రాలు



రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లను నియోజకవర్గాలకు తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27 : రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సిద్దిపేట జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి పకడ్బందీగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు రంగంలోకి దిగారు. అక్రమ డబ్బు చలామణి, మద్యం సరఫరా వంటి వాటిని అడ్డుకట్ట వేయడానికి 'సీ విజిల్' యాప్‌ను ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. అంతే కాకుండా నిఘా బృందాలు సమర్థవంతంగా, నిస్పక్షపాతంగా విధులు నిర్వహించేలా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ రోజు ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రిసైడింగ్, సెక్టోరియల్ అధికారులకు వీవీ ప్యాట్ మిషన్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

**అక్రమాలపై ఫిర్యాదుకు 'సీ విజిల్' యాప్**

ఎన్నికల్లో జరిగే అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం 'సీ విజిల్' యాప్‌ను రూపొందించింది. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా, పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురిచేస్తే ఆ వివరాలను నేరుగా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకొని.. 100 నిమిషాల సమయంలో దర్యాప్తు చేసి ఫిర్యాదు దారుడికి సమాచారం తెలియజేస్తారు. అదే విధంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు కలెక్టరేట్‌లో 1950 కంట్రోల్ రూమ్ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఎన్నికల సంబంధిత అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ప్రతి నియోజకవర్గానికి 3ఎంసీసీ టీమ్‌లు, 3 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, 3 స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు.

**పూర్తయిన మొదటి రౌండ్ ర్యాండమైజేషన్**

సిద్దిపేట జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొదటి రౌండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ర్యాండమైజేషన్ ప్రకారం ఎలక్షన్ బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్కాన్ చేసి దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. సిద్దిపేట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ పర్యవేక్షణలో ఈవీఎం యంత్రాలను నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేసి పోలీస్ బందోబస్తు మధ్య నియోజకవర్గ కేంద్రాలకు పంపించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

**జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,25,398**

సిద్దిపేట జిల్లాలో మొత్తం 9,25,398 మంది ఓటర్లు ఉండగా.. 1,151 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మహిళా ఓటర్లు 4,68,140 మంది ఉండగా.. పురుష ఓటర్లు 4,57,178 మంది ఉన్నారు. ఇందులో జిల్లాలో హుస్నాబాద్(32) నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 2,36,575 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,19,406 మంది ఉండగా.. పురుషులు 1,17,165 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. సిద్దిపేట(33) నియోజకవర్గంలోని 273 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,28,523 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 1,15,520 మంది ఉండగా.. పురుషులు 1,12,934 మంది, ఇతరులు 69 మంది ఉన్నారు. దుబ్బాక(41) నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,94,664 మంది ఓటర్లు ఉండగా.. మహిళలు 99,359 మంది ఉండగా.. పురుషులు 95,305 మంది ఉన్నారు. గజ్వేల్(42) నియోజకవర్గంలోని 321 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,65,636 మంది ఉండగా.. ఇందులో మహిళలు 1,33,855 మంది ఉండగా.. పురుషులు 1,31,774 మంది ఉండగా.. ఏడుగురు ఇతరులుఉన్నారు. అంతే కాకుండా జిల్లాలో 19 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉండగా.. 451 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



చౌడారంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

చిన్నకోడూరు, అక్టోబర్ 27: చిన్నకోడూరు మండలంలోని చౌడారంలో సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంక్, మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార కేంద్ర బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ బ్యాంకులో పొదుపు చేసి ప్రతి రూపాయి భవిష్యత్ అవసరాలకు భరోసానిస్తాయి. పలు రకాల పొదుపు డిస్కౌంట్ స్కీమ్‌ల వివరాలను తెలిపారు. ప్రత్యేక అవసరాలకు ఇచ్చే బంగారు, విద్య, వ్యవసాయ రుణాలు ప్రజలకు వివరించారు. లీడ్ బ్యాంక్ ఏఫ్ఎల్‌సీ కౌన్సిలర్ దయాకర్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సరైన సమమంలో చెల్లిస్తే భవిష్యత్‌లో ఎక్కువ రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి వ్యక్తికి జీవిత బీమా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ, లీడ్ బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ యోధుల చరిత్రను తెలుసుకోవాలి

**దొడ్డి కొమురయ్య చిత్ర దర్శకుడు సేనాపతి**



దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చిత్ర బృందం

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 27 : తెలంగాణ యోధుల చరిత్రను అందరూ తెలుసుకోవాలని దొడ్డి కొమురయ్య చిత్ర దర్శకుడు సేనాపతి అన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సేనాపతి మాట్లాడుతూ జనం కోసం బతికిన ..జనం కోసం అంకితమైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే సంకల్పంతో ఆ యెధుడి చరిత్రను సినిమా రూపంలో తీసుకువస్తున్నామన్నారు.అందులో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కులమతాలకు అతీతంగా అందరిని కలిసి కమిటీలను వేస్తున్నామన్నారు. చిత్ర నిర్మాణంలో సైతం ప్రతి జిల్లా నుంచి 30 మందికి సహ నిర్మాతలుగా అవకాశం కల్పిస్తున్నామన్నారు. సహ నిర్మాతలుగా వ్యవహరించడానికి ఉత్సహం, అంకిత భావం కలిగిన వారు దొడ్డి కొమురయ్య చిత్ర నిర్మాణ కమిటీ సిద్దిపేట జిల్లా చైర్మన్ సింగోజు మురళీకృష్ణను సంప్రదించాలని కోరారు. ఈ సినిమా ద్వారా పోరాట యోధుడి చరిత్రను తెలుసుకోబోతున్నందుకు సంతోషంగా ఉందని మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు బోయ రాములు, కృష్ణమూర్తి,శ్రవణ్, అనిల్,దిలీప్‌తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ఎన్నికల అధికారిని కలిసిన జిల్లా కలెక్టర్



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27 : తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంచిర్యాల జిల్లాలో ఎన్నికల నిర్వహణ గూర్చి సమావేశం నిర్వహించేందుకు వెళ్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను సిద్దిపేట పట్టణ శివారులోని హరిత మినర్వా హోటల్ వద్ద శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ మేరకు జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రయ గురించి కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, కమిషనర్ శ్వేత పాల్గొన్నారు.

## కష్టపడి ప్రతిఫలం సాధించాం..



క్రీడాకారుడిని అభినందిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 27 : కష్టపడి ప్రతిఫలం సాధించాం.. మంత్రి తన్నీరు హరీశ్‌రావు కన్న కలను నిజం చేశామని సిద్దిపేట ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్ ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో ఫుట్‌బాల్ స్టేడియం నిర్మాణం జరుగుతున్న సమయంలో మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన అనుకున్న కల నేడు సాకారమైందన్నారు. సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న అబ్దుల్ సమద్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ నేషనల్ మీట్‌లో సెలక్ట్ కావడం ఆనందంగా ఉందన్నారు. జమ్ముకాశ్మీర్‌లో జరిగే నేషనల్ మీట్‌లో సమద్ ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాల సాయిరామ్ అభినందించారు.

## వాహన తనిఖీల్లో 13 కిలోల వెండి పట్టివేత

ములుగు, అక్టోబర్ 27 : వాహన తనిఖీల్లో భాగంగా ముగ్గురు వేరు వేరు వ్యక్తుల నుంచి రూ. 3,54,000 నగదు, 13 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ములుగు మండల పరిధిలోని వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1,87,000, 1,67,000 నగదుతో పాటు 13కిలోల వెండి నిరాధారిత ఆభరణాలను ముగ్గురు వేరు వేరు వ్యక్తుల నుంచి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రైతుల పాలిట రాబంధులా కాంగ్రెస్..

**నంగునూరు బీఆర్ఎస్ మండల నాయకులు**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, అక్టోబర్ 27 : రైతుల పాలిట రాబంధులా కాంగ్రెస్ పార్టీ మారిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ తడిసిన ఉమ అన్నారు. రైతుబంధు ఆపాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంపై వారు మండిపడ్డారు. ఈ మేరకు మండల పరిధిలోని బద్దిపడగలో విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేయడం లేదని ప్రతిపక్షాలు మతికి తెచ్చుకోవాలన్నారు. గత కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంట్, సాగునీరు ఇవ్వకపోవడంతో రైతులు అనేక ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రైతు కుటుంబంలో పుట్టిన నాయకుడు, రైతుల గురించి తెలిసిన నాయకుడు, రైతుల కష్టాలు నేరుగా చూసి అనుభవించిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. పైరవీలకు, అవినీతికి తావివ్వకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకే అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వేముల వెంకట్‌రెడ్డి, దువ్వల మల్లయ్య, సంగు పురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజసేవలో తమ వంతు సాయం చేస్తున్నాం..

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 27 : సమాజసేవలో తమ వంతు సాయం అందించాలనే లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ పని చేస్తున్నదని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ వికాస్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో నిర్మించిన రెండు మరుగుదొడ్లను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. యూనియర్ బ్యాంక్ ఆధ్వర్యంలో 30 మంది ఆడపిల్లకు ప్రతి ఏడాది రూ.2000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.